సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 6 । మే । 2025



చదువుతోనే మంచి భవిష్యత్తు

చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రణాళిక బద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. - 8లో



కరడు గట్టిన దొంగలు అరెస్టు

ప్రొద్దుటూరులోని బొల్లవరం చోరీ కేసులోకర్ణాటకలోని బెల్గాం ప్రాంతానికి చెందిన నలుగురు అంతర్‌రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.3 /27.0

జిల్లాలో సోమవారం 27.0 – 41.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

జెడ్పీ సమావేశం వాయిదా

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 15వ తేదికి వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేది నిర్వహించాల్సిన సమావేశాన్ని.. ఆరోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉండడం వల్ల వాయిదా వేశామని వెల్లడించారు. జెడ్పీ సభ్యులు, అధికారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

12న పీసీసీ అధ్యక్షురాలి రాక

కడప వైఎస్ఆర్ సర్కిల్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 12న కడపకు వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షర్మిల రాక సందర్భంగా ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నాయకులతో షర్మిల పార్టీ అభివృద్ధికి దిశా నిర్దేశం నిర్దేశం చేస్తారన్నారు. పర్యటన పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. అనంతరం ప్రజా సమస్యలపై ఎస్పీని కలిసి చర్చించారు. నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, డీసీసీ ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్ కదిరి ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గౌస్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేద్దాం
– ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)కు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను ఆలకించారు. సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు.

ఐటీఐలలో అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు, 14 ఏళ్లు నిండిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అడ్మిషన్లు 10వ తరగతి మార్కుల ఆధారంగా మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయిస్తామని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణపత్రం, టీసీ, ఆధార్, ఫొటో, మెయిల్ ఐడితోపాటు పర్మినెంట్‌గా వినియోగించే మొబైల్ నెంబర్‌తో దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ వద్దకు వెళ్లి iti.ap.gov.in వెబ్‌సైట్ నందు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.రిజిస్ట్రేషన్‌కు మే 24వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కీట్స్ స్వచ్ఛంద సంస్థ, విజయవాడ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూ జీకేవై కార్యక్రమం ద్వారా పేషెంట్ రిలేషన్‌షిప్ అసోసియేట్ (పీఆర్ఏ) కోర్సులో రెండు నెలలపాటు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అడ్మిషన్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, 19–30 ఏళ్లలోపు కలిగి ఇంటర్మీడియేట్ పాస్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఇందుకు అర్హులన్నారు. రెండునెలలపాటు కొనసాగే శిక్షణా కాలంలో ఉచిత వసతితోపాటు భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

రేపు కన్యకాపరమేశ్వరీదేవి జయంతి వేడుక

రాజంపేట టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాలలో బుధవారం కన్యకాపరమేశ్వరీదేవి జయంతి వేడుకను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణగుప్త సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవ, ఆరు నుంచి ఏడు గంటల వరకు గణపతి, సుబ్రమణ్య, నవగ్రహ అభిషేకాలు ఉంటాయన్నారు. ఏడు గంటల నుంచి ఏడున్నర వరకు పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 9 నుంచి 10 గంటల వరకు మూలవర్లు, ఉత్సవర్లకు అభిషేకం, అమ్మవారి వెండిరథ ప్రాకారోత్సవం, మంగళహారతులు, మంత్ర పుష్పం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

బాబు తీరు.. రైతు బేజారు

- రాయితీ విత్తనానికి కోత పెట్టిన చంద్రబాబు ప్రభుత్వం
- మరోమారు రైతులపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన వైనం
- జిల్లాకు ఖరీఫ్ విత్తనాల కేటాయింపులు తగ్గించిన కూటమి సర్కార్



కడప అగ్రికల్చర్ : సీఎం చంద్రబాబుకు ఆది నుంచి వ్యవసాయమంటేనే గిట్టదు. రైతులంటే అస్సలు పడదు. ఇది నిజమని మరోసారి తెలిసిపోయింది. అవును.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తుందనే విషయం విత్తన కేటాయింపులతో రుజువైంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదవుతున్న అమలు చేయకుండా అటకెక్కించింది. దీంతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాను కూడా పక్కన పెట్టేసింది. తాజాగా ఖరీఫ్ సీజన్ సాగుకు సంబంధించి రైతులకు అందించే రాయితీ విత్తనాల కేటాయింపుల్లో కూడా కోత పెట్టింది. మరోమారు తమది రైతు వ్యతిరేక ప్రభుత్వమని చాటుకుందని రైతులు విమర్శలు చేస్తున్నారు. విత్తనాల కేటాయింపు తగ్గించడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది విత్తనాల సేకరణకు తిప్పలు తప్పవని దిగాలు చెందుతున్నారు.

మరో నెల రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం...

మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానుంది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఇరిగేటెడ్, నాన్ ఇరిగేటెడ్‌కు సంబంధించి 1,28.084 హెక్టార్లలో వివిధ పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి రైతన్నలకు ఏ మేరకు విత్తనాలు అవసరమో ప్రణాళికలను పంపి విత్తనాలను తెప్పించి రైతులకు సబ్సిడీ కింద అందిస్తుంది. జిల్లాలో ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జనుములు, జీలగలు, పిల్లపెసర, మినుములు,పచ్చ పెసలు, కందులతోపాటు వేరుశనక్కాయలను అవసరం ఉంటుంది. వీటిన్నింటిని ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందివ్వాల్సి ఉంది. అలా సబ్సిడీతో ఇచ్చే విత్తనాల కేటాయింపులో కూడా కూటమి ప్రభుత్వం కోత పెట్టింది. విత్తనాల మంజూరులో కోత విధించడంపై రైతులు, రైతు సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేటాయింపుల్లో కోత..

జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా రైతులకు సబ్సిడీ కింద 12,252 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు కేటాయించింది.ఈ ఏడాది ఖరీఫ్‌కు వైఎస్సార్ జిల్లా రైతులకు 11,432 క్వింటాల్లు రాయితీ విత్తనాలు అవసరమవుతాయని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సాధారణంగా జిల్లా నుంచి వెళ్లిన ప్రతిపాదనలను ప్రభుత్వం యథావిధిగా ఆమోదిస్తూ అనుమతించడం కొన్నేళ్లుగా జరుగుతోంది. ఈ సారి ప్రతిపాదనలో కోత వేస్తూ ప్రభుత్వ విత్తనాలను కేటాయించడం గమనార్హం. జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్–2025కు సంబంధించి జిల్లాకు మొత్తంగా 11432 క్వింటాళ్ల విత్తనాలు అవసరంకాగా అందులో 8591.55 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. అంటే గతేడాది కంటే ఈ ఏడాది 2840.45 క్వింటాళ్ల కేటాయింపులు తగ్గించారు.

ఖరీఫ్‌కు విత్తన ప్రతిపాదనలు కేటాయింపులు క్వింటాళ్లలో..

విత్తనాలు	ప్రతిపాదనలు	కేటాయింపు
జీలుగ	1775	1537
జనుములు	3140	2982
పిల్లపెసర	166	48
మినుము	302	268
పచ్చపెసలు	36	25
కందులు	505	478.55
వేరుశనగ	5508	3253
మొత్తం	11432	8591.55

అవసరమైతే తెప్పిస్తాం...

జిల్లాకు సబ్సిడీ విత్తనాలకు సంబంధించి 11432 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలను పంపగా ప్రస్తుతం 8591 క్వింటాళ్లు కేటాయించింది. ఆ విత్తనాలు పంపిణీ చేయగా అవసరమైతే రైతులకు విత్తనాలు తెప్పించి అందచేస్తాం.
– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఈ ప్రభుత్వంలో రైతులకు కష్టాలే



కూటమి పాలనలో రైతులు కష్టాలు పడుతున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా రైతులకు ఎలాంటి సాయమందలేదు. రైతు సంక్షేమం గాలికి వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా పంటలకు మద్దతు ధరలు లేక రైతులు నష్టాలపాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఖరీఫ్‌లో విత్తనాల కేటాయింపులు తగ్గించడం దారుణం. ప్రభుత్వం స్పందించి విత్తనాల కేటాయింపు పెంచాలి. – డి. మురళీమోహన్‌రెడ్డి, రైతు, సుంకేసుల, ఖాజీపేట

కేటాయింపులు పెంచాలి



గతేడాది సాగు చేసిన పంటలు అతివృష్టి, అనావృష్టితో చాలా మేరకు దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఇలాంటి తరుణంలో ఈ ఏడాది జిల్లా విత్తన కేటాయింపుల్లో ప్రభుత్వం కోత విధించింది. వైఎస్సార్ జిల్లాకు విత్తన కేటాయింపులు తగ్గించడం రైతులను ఇబ్బందులకు గురి చేయడమే. దీంతోపాటు గతేడాది మాదిరిగా కాకుండా సబ్సిడీ శాతాన్ని కూడా పెంచి రైతులను ఆదుకోవాలి. – పోతిరెడ్డి భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి,సీపీఐ అనుబంధ విభాగం

కోత విధించడం దుర్మార్గం



రాయితీ విత్తనానికి కూటమి ప్రభుత్వం కోత విధించడం దుర్మార్గం. కరువు పరిస్థితులు నెలకొన్న తరుణంలో విత్తన కేటాయింపులు తగ్గించడం రైతులకు ఇబ్బందులకు గురి చేయడమే. అసలే అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు పెట్టుబడి సహాయం 20,000 ఇస్తామని హామీని నీరుగార్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో 90% సబ్సిడీతో విత్తనాలు ఐదు బస్తాలు చొప్పున ప్రతి రైతుకు ఇవ్వాలి.
– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం
– జేసీ అదితిసింగ్



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు సత్వర పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు.

- కడప నగరం పాలెంపల్లెకు చెందిన సి. వెంకట సుబ్బమ్మ తనకు వితంతు పింఛను పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.
- దువ్వూరు మండలం, కానగూడూరుకు చెందిన పి. ఖాసీంబీ తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి కుళాయి కనెక్షన్ ఇప్పించి ఆదుకోవాలని కోరారు.
- తొండూరు మండల కేంద్రానికి చెందిన వి.శివ నారాయణ రెడ్డి సర్వే నెం. 347/ఏలో ఓ.18 సెంట్ల స్థలాన్ని పట్టాదారు పుస్తకంలో ఎక్కించాలని అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్, ఎస్ డీసీ శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి వైవీయూ డిగ్రీ పరీక్ష వాయిదా

కడప ఎడ్యుకేషన్: వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల బీఏ, బీకాం, బీఎస్సీ ,బీసీఏ, బీబీఏ,ఒకేషనల్ 2,4,6 సెమిస్టర్లకు సంబంధించి ఈ నెల 7వ తేదీన జరగాల్సిన పరీక్షను వాయి దా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు వెల్లడించారు. ఈనెల 7వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఐసెట్ పరీక్ష ఉందన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, యోగివేమన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నాని వివరించారు. వాయిదా వేసిన పరీక్షలను ఇదే నెల 23న నిర్వహిస్తామని వెల్లడించారు.

వైభవం.. గజవాహనోత్సవం

కమనీయంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



గజవాహనంపై స్వామి, అమ్మవారి ఊరేగింపు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కమనీయంగా జరుగుతున్నాయి. రెండో రోజైన సోమవారం రాత్రి గజవాహనోత్సవం వైభవంగా సాగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గజవాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి వీరశివకుమార స్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. భక్తులు స్వామి, అమ్మవార్లను కనులారా దర్శించుకుని తరించారు. ఉత్సవానికి గుంటూరు జిల్లా బుద్దాంకు చెందిన కట్టోజు సత్యనారాయణ చార్యులు, వరహాలమ్మ, విశ్వనాథాచారి, గురుస్వాములు, శివరూపాచారి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, గోవింద స్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



హాజరైన పరిశోధన, విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

- వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్
- దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన – విస్తరణ సలహా మండలి సమీక్షా సమావేశం తొలి రోజు ప్రశాంతం

కడప అగ్రికల్చర్ : రైతుల జీవన, ఆర్థిక స్థితిని మెరుగుపరచడం కోసం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలి కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీదర్ సూచించారు. కడప నగర శివార్లలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో సోమవారం దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన – విస్తరణ సలహా మండలి సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో భాగంగా తొలి రోజు కార్యక్రమానికి అతిథులుగా కలెక్టర్‌తో పాటు ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం గుంటూరు లామ్ పరిశోధన సంచాలకులు పి.వి. సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు జి. శివనారాయణ, తిరుపతి ఆర్.ఎ.ఆర్.ఎస్. (సౌత్ జోన్) పరిశోధన సహాయ సంచాలకులు వి.సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు లాభాల బాటలో నడిచేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎదురయ్యే నిజమైన సమస్యను గుర్తించినపుడే రైతులకు పూర్తి స్థాయిలో సహకారం అందించిన వారవుతారని పేర్కొన్నారు. పరిశోధన ప్రణాళికలో పారదర్శకత, నిజాయితీ లేకపోతే కొన్ని రకాల సంప్రదాయ, వారసత్వ పంటలుగా పేరొందిన పంట రకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులకు, మన ప్రాంత భూమి స్వరూపానికి అనుగుణంగా పంటల పరిశోధన జరగాలని ఆకాంక్షించారు.

- డా. పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ పంటల సాగు ప్రాణాళికను సమర్థవంతంగా రూపొందించి.. రైతులకు లాభదాయకమైన పంటలను ఎంపిక చేయాలని శాస్త్రవేత్తలను కోరారు.
- డా. జి. శివనారాయణ మాట్లాడుతూ సాగుకు ఆమోదయోగ్యమైన భూములు దక్షిణ మండల వ్యవసాయ ప్రాంత పరిధిలో 30 శాతం మాత్రమే ఉన్నాయని ఆ శాతాన్ని మూడింతలు పెంపొందించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు.
- డాక్టర్ వి. సుమతి దక్షిణ మండల ప్రాంతీయ పరిశోధనా కేంద్రం పరిధిలో గత ఏడాదిలో వ్యవసాయ సాగుబడిలో సాధించిన పరిశోధన, విస్తరణ ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం శాస్త్రవేత్తలు ప్రచురించిన పలు రకాల పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. ఐదు జిల్లాల పరిశోధన, విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

తెలుగుపదానికి జన్మదినం..
జానపదానికి జ్ఞానపథం

పేరు : తాళ్లపాక అన్నమాచార్యులు
జననం : 1408 మే 09
మూలం : తాళ్లపాక
మరణం : 1503 ఫిబ్రవరి 23 (వయస్సు 94),తిరుపతి
సంగీతశైలి: కర్ణాటక సంగీతం
వృత్తి : రచయిత, యోగి, స్వరకర్త, కవి, పదకవితాపితామహుడు



అదివో అల్లదివో శ్రీవారి వాసము పది వేల శేషుల పడగలమయం..లాంటి కీర్తనలతో పదకవితాపితామహుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీవారి భక్తుల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నాడు. అన్నమాచార్యుడు 617 జయంతి సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం...

- తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య
- 12 నుంచి జయంత్యుత్సవాలు
- తాళ్లపాకలో శ్రీవారి కల్యాణం..

రాజంపేట : భాగవతసేవ పరాయణులైన నారాయణసూరి, లక్కమాంబలకు సంతానం లేకపోవడంతో ఏడుకొండలస్వామిని మొక్కుకున్నారు. తిరుమలకు చేరుకున్న ఈ దంపతులు స్వామి మందిరంలో ప్రవేశించారు.గరుడస్తంభం వద్ద సాగిలపడి మొక్కారు. వెంకటేశ్వరస్వామి తన నిజఖడ్గమైన నందకాన్ని ఆ పుణ్యదంపతులకు ప్రసాదించాడు. వాళ్లు పరమానంద భరితుల య్యారు.వెంకటపతిని దర్శించి స్తుతించారు.సంతోషంతో తాళ్లపాకకు తిరిగివచ్చారు. మే 9,1408న రాజంపేట మండలం తాళ్లపాకలో జన్మించాడు. తన ఎనిమిదో యేట అన్నమయ్యకు ఆయన గురువు ఘనవిష్ణుదీక్షనొసిగినప్పుడు అన్నమాచార్య నామం స్థిరపడింది.



తాళ్లపాకలో టీటీడీ నిర్మించిన అన్నమయ్య ధ్యానమందిరం

అన్నమయ్య తిరుమల పయనం..

అన్నమయ్య ఇంటిలో తల్లి సంగీతం, తండ్రి పాండిత్యం ఛాయలతో పెరిగాడు. ఉపవీత సంస్కారం పొందిన తర్వాత ఇంటి గురుకులంలో విద్యాభ్యాసం కొనసాగింది.ఏకసంథాగ్రాహి అయినందున అనతికాలంలో ఉన్నత విద్యావంతుడయ్యాడు. తన పదహారో యేట అన్నమయ్యకు శ్రీ వెంకటేశ్వర దర్శనానుభూతి కలిగింది. అప్పటి నుంచి అన్నమయ్య అద్భుతమైన కీర్తనలు రచించసాగాడు. వేడుకుందామా వెంకటగిరి వెంకటేశ్వరుని..అంటూ భక్తబృందంతో కలిసి అన్నమయ్య తిరుమలకు పయనమయ్యారు. వెంకటేశ్వరుని కీర్తిస్తూ తిరుమలలోనే జీవితం గడిపాడు.

సంసారం..సంకీర్తనం

తిరుమల నుంచి తాళ్లపాకకు చేరుకున్న అన్నమయ్యకు తిమ్మక్క, అక్కమ్మ అనే పడతులతో వివాహం జరిగింది. వైవాహిక జీవితంలో పడిన అన్నమయ్య ఒకరోజు తన ఇద్దరు భార్యలతో తిరుమలకు చేరుకున్నారు. ఆ సమయంలోనే శ్రీ వెంకటపతిపై రోజుకొక సంకీర్తన వినిపించాలని సంకల్పించాడు. అప్పటి నుంచి అన్నమయ్య పుంఖానుపుంఖాలుగా కీర్తనలు చెప్పాడు. అతని శిష్యులు వాటిని గానం చేస్తూ తాళపత్రాలకు ఎక్కించారు.భార్యలతో కలిసి తీర్థయాత్రలకు బయలుదేరారు. ముందుగా తన స్వగ్రామంలోని చెన్నకేశవుని అర్చించారు.మార్గంలోని నందలూరు సౌమ్యనాథుడు, ఒంటమిట్ట రామయ్య, కడప వెంకటరమణుని, చాగలమర్రి చెన్నకేశవున్ని, అహోబిలం నృసింహస్వామిలను దర్శించుకుని కీర్తనలు ఆలపించారు. కీర్తనలు అంతటా ప్రసిద్ధి చెందాయి.

అన్నమయ్య కీర్తనలు..రచనలు..

అన్నమయ్య సంకీర్తనా సేవ సంగీత, సాహిత్య, భక్తి పరిపుష్టం. తెలుగు వ్యవహారిక భాష, దేశి సంగీత విధానాలు రెండు అతని రచనల్లో ఉన్నాయి. లభించిన వాటిలో తొలి సంకీర్తనలు కనుక అన్నమయ్య సంకీర్తనాచార్యుడు, పదకవితాపితామహుడు అయ్యాడు. 32వేల కీర్తనలు ఆలపించారు. అలిమేలు మంగ, శ్రీనివాసుల కీర్తనలకు తన జీవితాన్ని అంకితం చేసిన పరమభక్తుడు అన్నమయ్య. సరళమైన మాటల్లో అధ్యాత్మిక సత్యాలను, వెంకటపతి తత్వాన్ని , జీవాత్మ పరమాత్మల తాదాత్మ్యాన్ని వినిపించాడు.లోకనీతిని, ధర్మాన్ని, విష్ణుతత్వాన్ని కీర్తించాడు. దక్షిణాపథంలో భజన సంప్రదాయానికి అన్నమయ్యే ఆద్యుడు.

12 నుంచి జయంతి ఉత్సవాలు

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 617 జయంతి ఉత్సవాలను ఈనెల 12 వతేది నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ స్థానిక టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఉత్సవాలు జరుతాయన్నారు. 12న సంకీర్తన గోష్టిగానం,నగర సంకీర్తనలు ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు శ్రీవెంకటేశ్వరుని కల్యాణం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 13, 14న తాళ్లపాక, 108 అన్నమయ్య అడుగుల విగ్రహం వద్ద అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అన్నమయ్య జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ తరపున భక్తులకు పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

కువైట్‌లో వలసపాళెం వాసి మృతి


కేతవరం గంగాధర్ (ఫైల్)

అట్లూరు : బతుకు దెరువు కోసం వెళ్లి కువైట్‌లో అట్లూరు మండలం వలస పాళెం గ్రామానికి చెందిన కేతవరం గంగాధర్ (35)అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గంగాధర్ నాలుగేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. ఎనిమిది నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి భార్యా పిల్లలతో గడిపి కువైట్‌కు వెళ్లాడు. ఈ నేపథ్యంలో గత నెల 24వ తేదీన కువైట్‌లోని కేతాన్ సమీపంలో 55వ నెంబరు రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు తెలిసింది. కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంలో అక్కడి అధికారులు సమాచారం ఇవ్వడంతో వారు పాస్‌పోర్టు ఆధారంగా సోమవారం అట్లూరు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి పోయారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం


కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పారిశ్రామిక, వలస, అసంఘటిత కార్మికులు తమకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కార్మికులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి-యజమాని సమస్యలు, ఈ-శ్రమ్ కార్డుల పట్ల అవగాహన, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం వంటి వాటి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మనోహర్, ప్రవీణ్ కుమార్, పారా లీగల్ వలంటీర్ దశరథ రామిరెడ్డితో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పిడుగులతో జాగ్రత్త.!

- రాష్ట్రంలో రెండు రోజుల క్రితం పిడుగులు పడి ఆరుగురి మృతి
- అప్రమత్తత అవసరమంటున్న వాతావరణ శాఖ

రాజంపేట టౌన్ : ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుతున్నాయి. వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఫలితంగా ఈనెల 4వ తేదీ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడి ఆరుగురు మృతి చెందారు. విపరీతమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఎప్పుడు ఏ రకమైన వానలు కురుస్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిస్తే వాటితోపాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు పడటం సహజంగా జరుగుతుంది. పిడుగుకు బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందువల్ల పిడుగులు పడిన ప్రతిసారి మనుషులతో పాటు పశువులు మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు పిడుగుపాటుకు సమిధలవుతున్నారు. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం దగ్ధమవుతున్నాయి. పిడుగు పడే ప్రాంతాలపై విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలను అప్రమత్తం చేస్తున్నా ప్రాణనష్టం జరుగుతుండటం బాధాకరం. తగు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి..

పిడుగుపాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తయిన ప్రదేశాల నుంచి నేరుగా భూమిలోకి లైట్నింగ్ కండక్టర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. దీనిని ఏర్పాటు చేసుకోవడం వల్ల పిడుగులో ఉన్న విద్యుతావేశం భూమిలోకి ఆకర్షించుకుంటుంది. ఎత్తయిన భవనాలు, ఇతర నిర్మాణాలు నిర్మించుకున్నప్పుడు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

మిలియన్ మెగావాట్ల శక్తి..

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసేటప్పుడు బయటకు వెళ్లక పోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో ఉరుములు, మెరుపులు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లకూడదు. మెరుపు లేదా పిడుగు కాంతిని చూసేందుకు కూడా ప్రయత్నించకూడదు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి.

సమయస్ఫూర్తి అవసరం..

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు అప్రమత్తం కావాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒకవేళ సురక్షిత ప్రాంతానికి వెళ్లే సమయం లేకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి మోకాళ్లపై చేతులు, తలపెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. అందువల్ల సమీపంలో పిడుగు పడినా అందులో విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. పిడుగు పడుతుందని అనిపించినప్పుడు రబ్బరు చెప్పులు వేసుకోవడం మంచిది. అలా కుదరని పరిస్థితిలో కాళ్లను భూమి మీద పూర్తిగా ఆనించకుండా, కాలివేళ్లపై ఉండేందుకు ప్రయత్నించాలి.

మే, జూన్ నెలల్లో అప్రమత్తంగా ఉండాలి..

పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మే, జూన్ నెలల్లో ఎక్కువగా పిడుగులు పడే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు క్యూములో నింబస్ మేఘాల కారణంగా పిడుగులు పడే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షం కురిసే అవకాశం ఉందని ముందే తెలిసినప్పుడు వీలైనంత వరకు ప్రజలు బయటకు వెళ్లకపోవడం మంచిది.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

- సాధారణంగా ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాలపై పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. అందువల్ల వర్షం కురిసే సమయంలో ఎత్తయిన చెట్లు, సెల్‌టవర్, విద్యుత్ స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.



- టీవీలు, రిఫ్రిజిరేటర్లు, విదుత్ కుక్కర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు కంప్యూటర్లు ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించకూడదు
- వర్షం కురిసినప్పుడు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి.
- గుంపులుగా ఉండకుండా దూరంగా ఉండాలి.
- ముఖ్యంగా పొలాల్లో పనిచేయడం, పశువులు మేపడం వంటివి చేయకూడదు.
- చెరువు, ఈతకొలనులు వంటి బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు.

ప్రథమ చికిత్స ఇలా చేయాలి..

- పిడుగుపాటుతో అస్వస్థతకు గురైన వారిని వెంటనే గాలి, వెలుతురు తగిలే విశాలమైన ప్రాంతంలో ఉంచాలి.
- తడి దుస్తులు తొలగించి పొడి దుస్తులు వేయాలి.
- మెల్లగా పడుకోబెట్టి రెండుకాళ్లు పైకి ఎత్తి ఉంచాలి.
- తల ఒకవైపునకు తిప్పి పెట్టాలి.
- నోటి ద్వారా నీరు, ఇతర ఎలాంటి ఆహారాన్ని అందించకూడదు.
- వెంటనే అందుబాటులో ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లి వైద్య సేవలు అందించాలి.

మిద్దెపై నుంచి పడి పెయింటర్ మృతి


రాజశేఖర్(ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో వైఎస్‌ఆర్ కాలనీలోని రాజేశ్వరి అనే మహిళ ఇంటికి ఈనెల 4వ తేదీన ఆదివారం పెయింటింగ్ పనిచేసేందుకు వెళ్లిన ఓబుళాపురం రాజశేఖర్ (50) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మిద్దెపైనుంచి కింద పడటంతో మృతి చెందాడు. కడప రిమ్స్ పోలీసు స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలసపాడు మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లె దళిత కాలనీకి చెందిన ఓబులాపురం రాజశేఖర్, తన కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం రామాంజనేయపురంలో ఉంటున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మేస్త్రీ వెంట పెయింటింగ్ వేసేందుకు వెళ్లాడు. మిద్దెపైకి వెళ్లి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో బాధపడుతున్న అతన్ని రిమ్స్‌కు తరలించారు. మధ్యాహ్నం మృతి చెందాడు. అతని కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మోహన్, పోలీసు సిబ్బంది

ఖాజీపేట : సొంత వదినపై హత్యాయత్నం చేసి పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుంచి హత్యకు ఉపయోగించిన మచ్చుకత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

2015 సంవత్సరంలో దాదం నాగేశ్వర్‌రావు భార్య పార్వతిని నాగేశ్వర్ రావు అన్న అనంతరావు హత్య చేశాడు. ఈ సంఘటనపై భర్త నాగేశ్వర్ రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు అనంతరావును అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ నేపథ్యంలో కేసు రాజీ విషయమై తోటి బంధువులు నాగేశ్వరరావుపై ఒత్తిడి తీసుకువచ్చారు. తల్లి మృతితో పిల్లలు అనాథలుగా మారినందున వారి ఆలనా పాలన కోసం రూ. 2లక్షలు చెల్లించేలా రెండేళ్ల క్రితం ఒప్పందం కుదిర్చారు. ఈ మేరకు అనంతరావు రూ. 1.60 లక్షలు నాగేశ్వరరావుకు చెల్లించాడు. మిగిలిన రూ.40 వేలు ఇవ్వకపోవడంతో అనంతరావును నాగేశ్వరరావు పలుమార్లు అడిగాడు. అయినా ఆయన ఇవ్వకపోవడంతో అతనిపై కక్ష పెంచుకున్నాడు. ఈ పరిస్థితిలో గత నెల 28వ తేదీన అనంతరావు, ఆయన భార్య లక్ష్మీదేవిలను హత్య చేసేందుకు పథకం రచించి నాగేశ్వరరావు తన అన్న ఇంటికి వెళ్లాడు. అక్కడ అనంతరావు లేకపోవడంతో వదిన లక్ష్మీదేవిపై మచ్చుకత్తితో దాడికి యత్నించాడు. అక్కడే ఉన్న బంధువు నవీన్‌రావు దాడిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నాగేశ్వర్ రావును సోమవారం అతని ఇంటివద్దే అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి మచ్చుకత్తిని స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచారు.

కరడు గట్టిన దొంగలు అరెస్టు

- ప్రొద్దుటూరులోని బొల్లవరం చోరీ కేసులో పురోగతి
- పట్టుబడిన దొంగలు కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాంకు చెందిన వారు
- 23.4 తులాల బంగారు నగలు స్వాధీనం
- అరెస్టు వివరాలను వెల్లడించిన ప్రొద్దుటూరు డీఎస్పీ భావన


నిందితుల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ప్రొద్దుటూరు డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : వారు కరడు గట్టిన దొంగలు.. అడ్డు వస్తే చంపడానికి కూడా వెనుకాడరు. 16 ఏళ్ల వయసు నుంచే చోరీలు చేస్తూ అంతర్ రాష్ట్ర దొంగలుగా రాటుదేలారు. ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరంలోని నరాల బాలిరెడ్డి కాలనీలో గత నెల 17న ఏక కాలంలో నాలుగు ఇళ్లలో చోరీకి ప్రయత్నించి, ఒకే ఇంట్లో పెద్ద ఎత్తున బంగారు ఎత్తుకెళ్లిన విషయం విదితమే. ఈ కేసులో కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం ప్రాంతానికి చెందిన నలుగురు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టు వివరాలను ప్రొద్దుటూరు డీఎస్పీ భావన సోమవారం సాయంత్రం మీడియా సమావేశంలో వెల్లడించారు.

కర్ణాటక రాష్ట్రం, బెల్గాం పట్టణంలోని వైభవ్‌నగర్‌కు చెందిన ఖాజా రఫిక్, సయ్యద్ అక్బర్‌లు చిన్ననాటి స్నేహితులు. వీరు 15 ఏళ్ల వయసు నుంచే చోరీలు చేసేవారు. కర్ణాటకతో పాటు తెలంగాణ రాష్ట్రంలో అనేక నేరాలు చేశారు. రాత్రి పూట ఇళ్లకు కన్నాలు వేసేవారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తితో కలసి తమ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న అర్మాన్ ఇర్ఫాన్, మహబూబ్ ఇబ్రహీం అనే ఇరువురిని పరిచయం చేసుకున్నారు. వారి ద్వారా అనేక చోరీలకు పాల్పడ్డారు. ఖాజా రఫిక్, సయ్యద్ అక్బర్‌లపై హత్యాయత్నం, హత్య కేసులతో సహా సుమారు 13 కేసులు ఉన్నాయి. మిగిలిన ముగ్గురిపై 5 చోరీ కేసులున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సయ్యద్ అక్బర్ కొన్నేళ్ల క్రితం అనంతపురం జిల్లాలోని గుంతకల్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా చోరీ ఘటన జరిగిన రెండు రోజుల ముందు నుంచే ఐదుగురు నిందితులు బొల్లవరంలోని నరాల బాలిరెడ్డి కాలనీలో రెక్కీ నిర్వహించారు. 16న రాత్రి 9 గంటలకు అందరూ కలసి మైదుకూరు రోడ్డులోని చాంద్ థియేటర్‌కు సెకండ్ షో సినిమాకు వెళ్లారు. సినిమా వదలగానే అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1.15 గంటల సమయంలో బాలిరెడ్డి కాలనీకి వెళ్లి చోరీ చేశారు. కేసులోని కీలక నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐలు ధనుంజయుడు, అరుణ్ రెడ్డి, ఏఎస్ఐ సుబ్బన్న, హెడ్‌కానిస్టేబుల్ భద్రారెడ్డి, కానిస్టేబుళ్లు దస్తగిరి, సుబ్రహ్మణ్యం, రమణారెడ్డి, చాంద్‌బాషా, ధనాంజినేయ, దినకర్, హోమ్‌గార్డు జనార్దన్‌రెడ్డిలను డీఎస్పీ భావన అభినందించారు. రివార్డు కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాల ఆధారంగా..

చోరీ జరిగిన వెంటనే డీఎస్పీ భావన పర్యవేక్షణలో త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి, టూ టౌన్, రూరల్ ఎస్ఐలు ధనుంజయుడు, అరుణ్‌రెడ్డిలతో కూడిన మూడు టీంలను ఏర్పాటు చేశారు. చోరీ సమయంలో సీసీ కెమెరాల్లో రికార్డు అయిన నిందితుల ఫొటోల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే సాంకేతిక పరిజ్ఞానంతో కారుతో పాటు చోరీ చేసిన దొంగలు ఎవరన్నది గుర్తించారు. నిందితులు ప్రొద్దుటూరు శివారు ప్రాంతంలో తిరుగుతున్నారని సమాచారం రావడంతో అరెస్ట్ చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం పట్టణానికి చెందిన ఖాజా రఫిక్, సయ్యద్ అక్బర్, షేక్ అర్మాన్ ఇర్ఫాన్. ముల్లా మహబూబ్ ఇబ్రహీంలు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. వారి వద్ద నుంచి 23.4 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు డీఎస్పీ భావన తెలిపారు. మరో నిందితుడితో పాటు మిగతా బంగారాన్ని కూడా రికవరీ చేస్తామని ఆమె వివరించారు.

భయపడొద్దు.. మేమున్నాం..

చోరీల పట్ల ప్రొద్దుటూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. నిరంతరం పోలీసులు రాత్రి గస్తీని పటిష్టపరిచామని ప్రజలు భయపడొద్దన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చోరీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దొంగతనాల నివారణకు ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో పని చేసే నిఘా కెమెరాలను ఇంట్లో అమర్చుకోవాలని సూచించారు. ఇటీవల ప్రొద్దుటూరు టూ టౌన్ పరిధిలోని హౌసింగ్‌బోర్డులో జరిగిన చోరీ కేసులో కూడా పురోగతి సాధించినట్లు డీఎస్పీ తెలిపారు. చోరీ అయిన సొత్తుతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రూరల్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో జరిగిన దొంగతనం ఘటనలో అంతర్ రాష్ట్ర దొంగల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోందని, వారి కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. సాధ్యమైనంత తొందరలోనే దొంగలను పట్టుకుంటామని డీఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రొద్దుటూరులో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు


పంట పొలాల్లోని వరి బస్తాల తూకాలను పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం లీగల్ మెట్రాలజీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. చికెన్ దుకాణాలను పరిశీలించి మూడు కేసులు నమోదు చేశారు. అలాగే పాత బస్టాండ్, శివాలయం సెంటర్‌లోని పండ్ల వ్యాపారులు ఉపయోగిస్తున్న తక్కెడలను ఇన్‌స్పెక్టర్ పరిశీలించి సరిగా లేని వాటిని సీజ్ చేశారు. ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీ చేసి ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఉప్పరపల్లి పంట పొలాల్లో వరి కొనుగోలు కాటాను తనిఖీ చేయగా తూకంలో తేడాలు ఉండడంతో కేసు నమోదు చేశారు.

ఎరువులు అమ్మిన డబ్బు ప్రభుత్వానికి జమ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు విక్రయించగా వచ్చిన రూ. 32 లక్షల డబ్బు ప్రభుత్వానికి అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు సేవా కేంద్రాల నుంచి ఆ డబ్బులు వసూలు చేయడంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. 2024-25లో జిల్లాలోని 75 రైతు సేవా కేంద్రాల్లో రూ. 3194 లక్షల బకాయిలు వసూలు చేయడంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ పరిమళజ్యోతి విస్మరించడం శోచనీయమన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు డిజిటల్ రూపంలో లావాదేవీలు నిర్వహించడంపై అవగాహన లేదన్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న రైతు సేవా కేంద్రాల సిబ్బంది నగదు రూపంలో, ఫోన్ పే రూపంలో వసూలు చేశారని తెలిపారు. ఆ డబ్బును రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉన్నప్పటికీ ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా జమచేయలేదని ఆరోపించారు.

మతం మారితే వ్యక్తి సామాజిక స్థితి మారదు


మల్లెం విజయభాస్కర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎస్సీలు క్రైస్తవ మతం స్వీకరిస్తే ఎస్సీ అర్హత కోల్పోతారని ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైంది కాదని ఏపీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయ భాస్కర్ అన్నారు. సోమవారం కడపలో ఆయన మాట్లాడుతూ అనేక కులాల వారు క్రైస్తవ మతం తీసుకున్నారని వారి కులం మారుతుందా అని ప్రశ్నించారు. ఏ కులంలో లేని విధంగా కేవలం ఒక ఎస్సీ కులానికే ఈ విధంగా తీర్పు ఇవ్వడం సరైంది కాదన్నారు. మతాన్ని సాకుగా చూపి ఎస్సీలకు అన్యాయం చేయ వద్దని కోరారు. దళిత క్రైస్తవులకు మత స్వేచ్ఛ, రక్షణ కల్పించాలని, క్రైస్తవులపై దాడులను అరికట్టాలని ప్రభు =త్వాన్ని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


బైకు అదుపుతప్పి మృతి చెందిన యువకుడు ఇర్ఫాన్‌బాషా

ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) : మండల పరిధిలోని నిడిజివ్వి సమీపంలో బైకు అదుపుతప్పి యువకుడు మృతి చెందాడు. సీఐ నరేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఇర్ఫాన్ బాషా(23) మహమ్మద్ ఆలీ, గౌస్‌బాషాలు కోగటం ఉరుసుకు వెళ్లారు. తిరిగి వెళుతున్న సమయంలో కదిరేవారిపల్లె సమీపంలో బైక్ అదుపు తప్పి కరెంటు స్తంభానికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇర్ఫాన్ బాషా(23) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

టాప్ 'టెన్' విద్యా రత్నాలను సన్మానించిన కలెక్టర్, ఎస్పీ


పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులతో జిల్లా కలెక్టర్, ఎస్పీ


మెమెంటో అందుకుంటున్న విద్యార్థిని జోషికా

కడప ఎడ్యుకేషన్ : చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రణాళిక బద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని దీంతో పాటు ప్రపంచస్థాయి పోటీతత్వాన్ని అలవరచుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. సోమవారం కడప నగర శివార్లలోని శిల్పారామంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన జిల్లా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మార్కులనే కొలమానంగా కాకుండా సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రపంచ స్థాయి విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించారని ఈ సందర్భంగా వారిని అభినందించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించే గొప్ప అవకాశం గురువులకు దక్కుతుందన్నారు. విద్యార్థులు పట్టుదల, ప్రణాళికతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. డీఈఓ షంషుద్దీన్ మాట్లాడుతూ జిల్లా పది ఫలితాల్లో 80 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 18 వ స్థానంలో ఉందన్నారు.

సన్మానం పొందిన విద్యార్థులు..

- పల్లేటి జోషికా(595), సింహాద్రిపురం మండలం రావులకొలను జెడ్పీ హైస్కూల్
- అతికారి పల్లవి (594) సిద్దవటం మండలం జెడ్పీ హైస్కూల్
- నీలం నాగ వీర తరుణ్ (593),పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జెడ్పీ హైస్కూల్
- బండి రామసాయి విఘ్నేష్ (593) కాశినాయన మండలం ఏపీ మోడల్ స్కూల్
- రుద్ర గంగ జశ్వంత్ రెడ్డి (592) వేంపల్లి మండలం రామిరెడ్డిపల్లి గ్రామం జెడ్పీ హైస్కూల్
- అతికారి రక్షిత (591) బద్వేలు మండలం జెడ్పీ హైస్కూల్,
- గంజికుంట వెంకట శివ సంతోష్ (591), జమ్మలమడుగు మండలం ఎంజేపీ ఏపీ బీసీ డబ్ల్యూఆర్ఎస్ (బాలుర) హైస్కూల్
- జడ కార్తీక్ (590) వేముల మండలం జెడ్పీ హైస్కూల్,
- కోగటం జువేరియ తహసీన్ (590), జమ్మలమడుగు మండలం జెడ్పీ హైస్కూల్,
- గంజికుంట తన్మయి (589) తొండూరు మండలం ఎంజేపీ ఏపీ బీసీ డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు)

ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ నిత్యానంద రాజు, ఇతర శాఖల జిల్లా అధికారులు, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్ రెడ్డి, మీనాక్షి, వివిధ మండలాల ఎంఈఓలు, ప్రభుత్వ పాఠశాలల హెడ్మాస్టర్లు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని దేవగుడి గ్రామానికి చెందిన జి. పెద్ద మాబు (79) అనే వృద్ధుడు విద్యుత్ స్తంభానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్ఐ రామక్రిష్ణ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవగుడి గ్రామానికి చెందిన పెద్ద మాబు భార్య కొద్ది నెలల క్రితం మృతి చెందింది. దీనికితోడు అతని ఆరోగ్యం సహకరించక పోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ వెలుపల ఉన్న తన పొలంలోకి వెళ్లి విద్యుత్ స్తంభానికి ఉరి వేసుకున్నాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుమారుడు మహబుబ్ బాషా ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తీవ్ర సంక్షోభంలో విద్యారంగం


కడప తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, పాలకుల విధానాలను నిరసిస్తూ సోమవారం కడప తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉందన్నారు. జీఓ నంబర్ 117 ద్వారా విద్యారంగం అతలాకుతలమైందన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 14న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గురయ్య, సీకే దిన్నె అధ్యక్షుడు సుబ్బారెడ్డి, అట్లూరు అధ్యక్షుడు మస్తాన్‌బాబు, మణి, సిద్దవటం బాధ్యుడు నరసింహబాబు, జిల్లా కౌన్సిలర్లు శివయ్య, నాగన్న పాల్గొన్నారు.